క్లుప్తంగా

అంకిత భావంతో పనిచేస్తేనే గుర్తింపు



తిమ్మరాజుపేటలో బదిలీపై వెళ్తున్న అధికారులను సత్కరిస్తున్న సర్పంచ్ మంగలక్ష్మి

మునగపాక: అంకిత భావంతో పనిచేసే ఉద్యోగులకు సమాజంలో తగిన గుర్తింపు ఉంటుందని తిమ్మరాజుపేట సర్పంచ్ భీమిశెట్టి మంగలక్ష్మి అన్నారు. ఇటీవల బదిలీపై వెళ్లిన తిమ్మరాజుపేట వీఆర్వో కె.రమేష్, పంచాయతీ కార్యదర్శి రమణారావులను బుధవారం సచివాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఉద్యోగులకు బదిలీలు సహజమని, అయితే పనిచేసే ప్రాంతంలో ప్రజలకు అందించిన సేవలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కృష్ణారావు, భీమరశెట్టి శ్రీనివాసరావు, బొడ్డేడ వెంకటరమణ, సూరిశెట్టి రాము, జగన్‌మోహన్, నరసింగరావు, ఉమాశంకర్ పాల్గొన్నారు.

భవానీ భక్తులకు అన్నసమారాధన



నక్కపల్లి కల్యాణ మండపంలో భిక్ష స్వీకరిస్తున్న భవానీ భక్తులు

నక్కపల్లి: మండల కేంద్రం నక్కపల్లిలో ఉన్న సుబ్బరామిరెడ్డి, హెట్రో కల్యాణ మండపంలో బుధవారం భవానీ భక్తులకు అన్నసమారాధన కార్యక్రమం ప్రారంభించారు. భవానీ దీక్షలు చేపట్టిన భక్తులకు పది రోజుల పాటు ఉచితంగా అన్నసమారాధన ఏర్పాటు చేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. నక్కపల్లి, ఉపమాక, సారిపల్లిపాలెం, మనబానవానిపాలెం తదితర గ్రామాల్లో ఈ ఏడాది భవానీ దీక్ష చేపట్టిన భక్తులు ఇక్కడ భిక్షను స్వీకరించాలని కోరారు.

ఇచ్ఛా ఫౌండేషన్‌కు నిత్యావసర సరకుల పంపిణీ



కొండకర్ల ఇచ్ఛా ఫౌండేషన్ పిల్లలకు నిత్యావసర సరకులు అందజేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(మునగపాక): మండలంలోని కొండకర్ల ఇచ్ఛా ఫౌండేషన్‌కు బుధవారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాండ్రేగుల చందు అభిమానులు నిత్యావసర సరకులు అందజేశారు. చందు జన్మదినం సందర్భంగా ఈ వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాను, మళ్ల వంశీ, పెదపాటి శివ,దాసు, లోకేష్, శ్రీనివాస్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

సంపద తయారీ కేంద్రాలతో అదనపు ఆదాయం



సంపద కేంద్రంలో వానపాములను విడుదల చేస్తున్న కార్యదర్శి లక్ష్మీనారాయణ

మునగపాక: సంపద తయారీ కేంద్రాల ద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందని పంచాయతీ కార్యదర్శి కాండ్రేగుల లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని మూలపేట సంపద తయారీ కేంద్రంలో బుధవారం ఆయన వానపాములను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంపద తయారీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. తడి, పొడి చెత్త సేకరణపై పాలకవర్గం దృష్టి సారించాలన్నారు. సర్పంచ్ బీశెట్టి గంగప్పలనాయుడు, పలువురు పాలక వర్గ సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎస్.రాయవరం: కొరుప్రోలు సబ్ స్టేషన్ పరిధిలో మెయింటెనెన్స్ పనుల కారణంగా గురువారం గుడివాడ ఫీడర్‌లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని అనకాపల్లి ఈఈ రాజశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. గుడివాడ, పి.ధర్మవరం గ్రామాల్లో ఆర్డబ్ల్యూఎస్ లైన్‌కు ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

మహాత్మా.. నిను మరువలేం

సత్యం, అహింసలను అస్త్రాలుగా చేసుకుని మన దేశానికి స్వాతంత్య్రం సాధించి పెట్టిన మహనీయుడు మహాత్మాగాంధీ అని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆయనను ప్రజలు ఎన్నటికీ మరువలేరన్నారు. నిరాడంబరమైన జీవన విధానంతో ఎందరికో మార్గనిర్దేశకులుగా నిలిచారన్నారు. ఆయన మార్గం యువతకు అనుసరణీయమని పేర్కొన్నారు. గాంధీజీ జయంతి వేడుకలను బుధవారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు.

- నీ మార్గమే మాకు అనుసరణీయం
- గాంధీ జయంతి కార్యక్రమాల్లో పేర్కొన్న వక్తలు
- జాతిపితకు వాడవాడలా నివాళులు

మునగపాక: ప్రతి ఒక్కరూ గాంధీజీ ఆశయ సాధనకు పాటుపడాలని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా మాజీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ కోరారు. గాంధీజీ జయంతి సందర్భంగా బుధవారం మునగపాక పీఏసీఎస్ కార్యాలయం ఆవరణలో గాంధీ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ స్వరాజ్యం కోసం గాంధీ ఎంతో కృషి చేశారన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, పార్టీ నేతలు దాసరి అప్పారావు, కోనపల్లి రామ్మోహనరావు, జగ్గారావు, ఆడారి కాశీబాబు, పిన్నమరాజు రవీంద్రరాజు, ఉప్పులూరి నాయుడు, మద్దాల వీరునాయుడు, కాండ్రేగుల జగన్, దొడ్డి వరహా, ఇల్లా నాగేశ్వరరావు, రాజాన బుజ్జి, బీశెట్టి ధనశ్రీను, శరగడం



మునగపాకలో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు ప్రసాద్

జగన్నాథరావు, పరమేష్, పీఏసీఎస్ విశ్రాంత సీఈవో పెంటకోట వెంకటరావు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

- మండలంలోని సంపద తయారీ కేంద్రాల ఆవరణలో గాంధీ జయంతి సందర్భంగా పారిశుధ్య కార్మికులను సత్కరించారు. మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జనసేన మండల అధ్యక్షుడు టెక్కలి పరశురామ్, డీఎల్‌డీవో మంజులావాణి, ఎంపీడీవో ప్రసాద్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రెవెన్యూ కార్యాలయంలో గాంధీజీ చిత్ర పటానికి తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు, సిబ్బంది పూలమాల వేసి అంజలి ఘటించారు.

నక్కపల్లి: నక్కపల్లి మండల పరిషత్ కార్యాలయంలో మహాత్ముని విగ్రహానికి ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ పూలమాలలు వేసి నివాళులర్పించారు. చినదొడ్డిగల్లు, ఉద్దండపురం, వేంపాడు తదితర గ్రామాల్లో కూడా గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. చినదొడ్డిగల్లులో ఉపాధ్యాయుడు లక్ష్మీనారాయణ పారిశుధ్య కార్మికులకు దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్



మునగపాకలో పంచాయతీ పారిశుధ్య కార్మికులను సత్కరిస్తున్న నాయకులు, అధికారులు

వీసం రామకృష్ణ, టీడీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేష్, వైస్ ఎంపీపీలు వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు, ఎంపీడీవో సీతారామరాజు, ఈవోపీఆర్‌డీ సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు తోట సత్తిబాబు, సర్పంచ్‌లు నేతల రత్నకుమారి, పి.వెంకటేష్, బచ్చలరాజు, చంద్రరావు, నాయకులు వెలగా శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ బొల్లం బాబ్జి, కొప్పిశెట్టి బుజ్జి, మీగడ సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం(మునగపాక): మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలతో పాటు సంపద తయారీ కేంద్రాల వద్ద అధికారులు, ప్రజాప్రతినిధులు గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. మార్టూలోని గాంధీ విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. కుటుంబ పెద్దను కోల్పోయిన ఆరు కుటుంబాలకు కేకేవీఎస్ వర్మ సేవా సమితి ఆధ్వర్యంలో కేవీఆర్ బ్యాచ్ సహకారంతో రూ. 5వేలు చొప్పున సాయం అందజేశారు. సంస్థ చైర్మన్ కేవీ రమణ, ఎస్.అచ్యుతరామరాజు, కేకే రమేష్‌బాబు, బైలపూడి రామదాసు, ద్వారపురెడ్డి బాబ్జీ, హరిబాబు, శ్రీనుబాబు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: అడ్డురోడ్డు కూడలిలో గాంధీజీ విగ్రహానికి సీపీఎం మండల బాధ్యుడు ఎం.సత్యనారాయణ పూలమాల వేసి అంజలి ఘటించారు. ఎస్.రాయవరం సచివాలయంలో స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది గాంధీజీ విగ్రహానికి నివాళులర్పించారు.

యలమంచిలి రూరల్: ఎంపీడీవో కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి ఎంపీపీ బోదెపు గోవింద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు అత్రైపు గుప్తా, బెజవాడ నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ వార్డు కౌన్సిలర్లు, ఎంపీడీవో కొండలరావు, ఏవో ప్రసాద్ పాల్గొన్నారు. సబ్ జైల్‌లో జరిగిన గాంధీ జయంతి వేడుకలో సీనియర్ సివిల్ జడ్జి పి.విజయ పాల్గొన్నారు. రిమాండ్ ఖైదీలతో భేటీ అయ్యారు. నేర స్వభావాన్ని విడనాడి, సత్ప్రవర్తనతో నడుచుకోవాలని ఆమె సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో జరిగిన గాంధీ జయంతి వేడుకల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి, వైఎస్సార్‌సీపీ వార్డు కౌన్సిలర్లు మహాత్ముని చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. కమిషనర్ ప్రసాదరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీలక్ష్మి, వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.



నక్కపల్లి ఎంపీడీవో కార్యాలయం వద్ద బాపూజీకి నివాళులర్పిస్తున్న ఎంపీపీ రత్నం, తదితరులు



గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మునగపాక తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు



గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి

కోటవురట్ల: రాజుపేట ఎంపీయూపీ స్కూల్ ఆవరణలో ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి హెచ్‌ఎం నాని మణిమోహన్ ఆధ్వర్యంలో పూల మాలలు వేసి నివాళిలర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొడ్డేటి వెంకటరమణ, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రాజుపేట ఎంపీయూపీ స్కూల్లో మహాత్మునికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



చినదొడ్డిగల్లులో పారిశుధ్య కార్మికులకు దుస్తులు అందజేస్తున్న ఉపాధ్యాయుడు లక్ష్మీనారాయణ



అడ్డురోడ్డు కూడలిలో గాంధీజీ విగ్రహం వద్ద అంజలి ఘటిస్తున్న సీపీఎం నాయకులు



ఎంపీడీవో కార్యాలయంలో మహాత్మునికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ బోదెపు గోవింద్, అధికారులు

నేటి నుంచి శరన్నవ రాత్రి వేడుకలు

నక్కపల్లి: శరన్నవ రాత్రి మహోత్సవాలు గురువారం నుంచి ఘనంగా ప్రారంభం కానున్నాయి. విజయదశమికి తొమ్మిది రోజుల ముందు నుంచి దసరా వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పలు గ్రామాల్లో అమ్మవారి విగ్రహాలను ఏర్పాటు చేసి తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు చేయనున్నారు. వివిధ రూపాల్లో ఉన్న దుర్గాదేవి విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు ప్రత్యేకంగా మండపాలు, పందెళ్లు వేశారు. మండలంలో దేవవరం, గొడిచర్ల, ఉద్దండపురం, చినదొడ్డగల్లు, నక్కపల్లి, వేంపాడు, కాగిత, ఉపమాక, తదితర గ్రామాల్లో దసరా ఉత్సవాల నిర్వహణకు ప్రత్యేక మండపాలు ఏర్పాటు చేశారు. కాగిత, చినదొడ్డిగల్లు ఉపమాక, ఉద్దండపురం గ్రామాల్లో ఉన్న దుర్గాదేవి ఆలయాల్లో కూడా శరన్నవరాత్రుల సందడి నెలకొంది. ఉపమాక అండాళ్లమ్మ ఆలయంలో ప్రతిరోజు అమ్మవారికి కుంకుమ పూజలు జరుగుతాయని ఆలయ అర్చకుడు గొట్టుముక్కల వరప్రసాద్ తెలిపారు.



మునగపాకలో లింగరాయి గుడి

పాయకరావుపేటలో..

పాయకరావుపేట పట్టణంతో పాటు పలు గ్రామాల్లో కూడా శరన్నవరాత్రుల సందడి నెలకొంది. పాయకరావుపేట మెయిన్ రోడ్డులో సూర్యామహాల్ సెంటర్, లావణ్య షాపింగ్ మాల్ ఎదురుగా, డీసీసీబీ బ్యాంకు ఎదురుగా, నాగరాజుపేట గేటు, లింగాల తోట కాలనీ, రైల్వేగేటు, రాజుగారిబీడు తదితర ప్రాంతాల్లో ప్రత్యేకంగా మండపాలు ఏర్పాటు చేసి అమ్మవారి ప్రతిమలను ప్రతిష్టించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. దుర్గాలమ్మచెట్టు వద్ద కూడా దేవీనవరాత్రులను ఘనంగా నిర్వహించనున్నారు. గణపతి నవరాత్రుల ముగిసిన తరుణంలో మరో తొమ్మిది రోజులు దేవీ నవరాత్రులు పల్లెల్లో సందడి చేయనున్నాయి.

అచ్యుతాపురం(మునగపాక): అచ్యుతాపురం, మునగపాక మండలాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. దుర్గాదేవి విగ్రహాలను గురువారం వాడవాడలా ఏర్పాటు చేసేందుకు నిర్వాహకులు చర్యలు తీసుకున్నారు. హరిపాలెం-అందలాపల్లి కొండపై శరన్నవ రాత్రి వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేశామని నిర్వాహకులు తెలిపారు. మునగపాక లింగరాయి గుడి, నందీశ్వర కళా ప్రాంగణంలోనూ, గౌరీ పీఠం ఆధ్వర్యంలో దుర్గాదేవి విగ్రహాలను ఏర్పాటు చేయనున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దుర్గాదేవి అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని నిర్వాహకులు కోరారు.

ఆఖరి మజిలీకి తప్పని అవస్థలు

- కోటవురట్లలో వరాహనదే శ్మశానవాటిక
- పెరిగిన తుప్పల్లో అంత్యక్రియలకు ఇబ్బందులు

కోటవురట్ల: ఆత్మీయులను కోల్పోయి అంతులేని దుఃఖంలో సాగించే అంతిమ యాత్రంలోనూ అవస్థలు తప్పడం లేదు. శ్మశానవాటిక లేక తుప్పలు, దిబ్బలపై చేస్తున్న దహన సంస్కారాలలో కన్నీటి వేదనే మిగులుతోంది. కనీస సదుపాయాల మాట అటుంచి దహన క్రియలకు ఆరు అడుగుల స్థలం కూడా లేకపోవడంతో ఆవేదన అవధులు దాటుతోంది. మండల కేంద్రం కోటవురట్లలో శ్మశానవాటిక లేకపోవడంతో ఈ దుస్థితి నెలకొంది. ఎన్నో ఏళ్లుగా సమస్య ఉన్నా అధికారుల నిర్లక్ష్యం స్థానికులకు శాపంగా మిగిలిపోయింది. పలుమార్లు మొరపెట్టుకున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో దహనక్రియలలో ఇక్కట్లు తప్పడంలేదు. మండల కేంద్రంలో 7,322 మంది జనాభా ఉన్నారు. మూడు మతాలకు సంబంధించి ముస్లింలకు శ్మశాన వాటిక ఉండగా.. హిందువులు, క్రైస్తవులకు శ్మశాన వాటికలు లేవు. దాంతో గ్రామ శివారున ఉన్న వరాహనదినే శ్మశాన వాటికగా వినియోగిస్తున్నారు. క్రైస్తవులు నది ఒడ్డున అంతి సంస్కారం చేస్తుండగా.. హిందువులు మాత్రం నది మధ్యలో దహనక్రియలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. వర్షాకాలంలో దహనక్రియలు ఎక్కడ చేయాలో అర్థం కాక పడరాని పాట్లు పడ్డారు. నదిలోకి భారీగా వరదనీరు వస్తే నది ఒడ్డున తుప్పల్లో గొడుగుల మాటున దహన సంస్కారాలు చేయాల్సిన పరిస్థితి తలెత్తింది.

కనీస సదుపాయాలు కరువు

హిందూ శ్మశానవాటికలో కనీస సదుపాయాలు లేవు. హిందూ ఆచారాల ప్రకారం దహనక్రియలు



వరాహనది మధ్యలో దహనక్రియలు చేస్తున్న హిందువులు(ఫైల్)

పూర్తయ్యాక అక్కడే స్నానాలు ఆచరించి ఇంటికి వెళతారు. ఇక్కడ వేచి ఉండేందుకు షెడ్ కూడా లేకపోవడంతో వర్షంలో తడుస్తూ ఉండాల్సి పరిస్థితి ఉంది. స్నానాలకు బోరు లేకపోవడంతో నదిలో స్నానాలు ఆచరిస్తున్నారు. అప్పుడప్పుడు ప్రమాదాలు జరిగి గల్లంతైన సంఘటనలు కూడా ఉన్నాయి. వేసవి కాలంలో నది ఎండిపోయిన సందర్భంలో చెలమలు తీసి ఆ గుంతల్లోనే స్నానాలు చేయాల్సి వస్తోంది. వాస్తవానికి శ్మశాన వాటికలో షెడ్, ఎలక్ట్రిక్ దహన పేటిక, మోటారు ఉండాలి. స్థలమే కరువవ్వడంతో సదుపాయాల సమస్య కనిపించడంలేదు. మండలంలోని పలు గ్రామాల్లో ఇవే పరిస్థితులు ఉన్నాయి. అధికారులు స్పందించి ఉపాధి హామీ పథకంలో శ్మశానవాటికలో తుప్పలు తొలగించి కనీస సదుపాయలు కల్పించాలని పలువురు కోరుతున్నారు.

దహన క్రియలకు తప్పని ఇక్కట్లు



శ్మశాన వాటిక లేకపోవడంతో దహనక్రియలకు చాలా ఇబ్బంది పడుతున్నాం. ఎన్నో ప్రభుత్వాలు మారాయి. కానీ శ్మశాన వాటిక సమస్య పరిష్కారం కాలేదు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ సమస్య గురించి పట్టించుకోవడం లేదు. వర్షా కాలంలో చాలా ఇబ్బంది పడుతున్నాం. అధికారులు స్పందించి శ్మశానవాటిక ఏర్పాటు చేయాలి.

– నిమ్మల కృష్ణారావు, కోటవురట్ల

కనీస సదుపాయాలు కల్పించండి..



హిందూ స్మశాన వాటిక లేకపోవడంతో వరాహనదిలోనే దహనక్రియలు చేస్తున్నారు. నదిలో వరదనీరు ప్రవహిస్తే చాలా ఇబ్బంది పడుతున్నాం. ఒక్కొక్కసారి మృతదేహాలతో నదిలో ఈదుకుని వెళ్లాల్సిన దుస్థితి ఉంది. శ్మశాన వాటికలో షెడ్ నిర్మించి, చేతిబోరు ఏర్పాటు చేయాలి.

– కశిరెడ్డి నాగు, కోటవురట్ల

వాడవాడలా 'స్వచ్ఛతా హీ సేవ'



ఏరియా ఆస్పత్రి ఆవరణలో తుప్పలు తొలగిస్తున్న అధికారులు, నాయకులు



కోటవురట్లలో స్వచ్ఛత హీ సేవా ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

నక్కపల్లి: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం బుధవారం మండలంలో పలు గ్రామాల్లో ఘనంగా జరిగింది. ఎంపీడీవో సీతారామరాజు ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది ఉపమాకలోని పెద్దచెరువు, బందుర సరస్సు, నక్కపల్లి ఏరియా ఆస్పత్రి ఆవరణలో చెత్త, పిచ్చి మొక్కలు తొలగించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆయన సూచించారు. నక్కపల్లి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద కూడా స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పారిశుధ్య కార్మికులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు వీసం రామకృష్ణ, జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, మండల టీడీపీ అధ్యక్షుడు వెంకటేష్, వైస్ ఎంపీపీలు వీసం నానాజీ, ఈశ్వరరావు, కొప్పిశెట్టి బుజ్జి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కొండబాబు, ఈవోపీఆర్‌డీ సత్యనారాయణ, కార్యదర్శి రాజశేఖర్, ఏరియా ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

కోటవురట్ల: మండలంలో బుధవారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి ఉదయశ్రీ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో చెత్తను తొలగించారు. అనంతరం ప్రధాన కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు, తహసీల్దార్ తిరుమల బాబు, ఏవో చంద్రశేఖర్, సర్పంచ్ బి.అనిల్ కుమార్, ఎంపీటీసీ సభ్యుడు వెంకట సూర్యారావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

లక్ష్యంతో చదివితే ఉజ్వల భవిష్యత్ సొంతం

మునగపాక: విద్యార్థులు లక్ష్యంతో చదువుకుంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ఎంఈవో శివనాయుడు అన్నారు. మునగపాక ప్రగతి స్కూల్ ఆధ్వర్యంలో ఇటీవల పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన ట్యాలెంట్ టెస్ట్‌లో అత్యధిక మార్కులు సాధించిన 16 మందికి రూ.10 వేలు చొప్పున నగదు బహుమతి బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసం నింపేందుకు ఇటువంటి పోటీలు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రగతి స్కూల్ డైరెక్టర్ మాడెం జోగారావు, ప్రిన్సిపాల్ వేగి శ్రీనివాసరావు, స్పందించే హృదయం చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు ఆడారి మూర్తి, సీఆర్పీ అచ్యుతకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



నగదు బహుమతి అందజేస్తున్న ఎంఈవో శివనాయుడు

యథేచ్ఛగా మాంసం విక్రయాలు

ఎస్.రాయవరం: గాంధీ జయింతి రోజున మండలంలో మాంసం దుకాణాలు యథావిధిగా తెరుచుకున్నాయి. హింసకు దూరంగా ఉండాలని మహాత్ముని మాటలు కేవలం చెప్పుకోవడానికే పరిమితమయ్యాయని పలువురు ఆక్షేపించారు. అడ్డురోడ్డు కూడలిలో చికెన్, మటన్ దుకాణాలు తెరిచి యథేచ్ఛగా విక్రయాలు చేపట్టారు. ఈ విషయం పంచాయతీ సిబ్బంది, ఇతర శాఖల అధికారులకు తెలిసినప్పటికి చర్యలు మాత్రం లేవని పలువురు విమర్శలు చేస్తున్నారు. బెల్టు దుకాణాలు ద్వారా మద్యం ఏరులై పారిందని పలువురు ఆరోపిస్తున్నారు. కొరుప్రోలు, గోకులపాడు, గుడివాడ, రేవుపోలవరం, దార్లపూడి తదితర గ్రామాల్లో బెల్టు షాపుల్లో యథావిధిగా అధిక ధరలకు మద్యం విక్రయాలు సాగించారు.



అడ్డురోడ్డులో తెరిచి ఉన్న మాంసం దుకాణం

చెకుముకి సైన్స్ పోటీల్లో ప్రతిభ

ఎస్.రాయవరం: మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పెదగుమ్ములూరు పాఠశాల ప్రథమ స్థానం, దార్లపూడి పాఠశాల ద్వితీయ స్థానంలో నిలిచాయి. విజేతలను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారని సైన్స్ ఉపాధ్యాయుడు కొలగాని వరప్రసాద్ తెలిపారు. జిల్లా స్థాయి సైన్స్ సంబరాలు ఈ నెల 27న అచ్యుతాపురంలో జరుగుతాయని చెప్పారు.



చెకుముకి సైన్స్ పోటీల్లో ప్రతిభకనబరిచిన దార్లపూడి పాఠశాల విద్యార్థులు